


# పెయింటిస్ట్ ?!

సరసి

**ఆ**ర్టిస్ట్ అభిరామ్‌కి సన్మానం

మినిస్టరు గారు దిగేసరికి 'ఆర్ట్ గేలరీ' లో కోలాహలం సద్దుమణిగింది. అందరూ సింహద్వారం వైపు కదిలారు. మంత్రిగారిని లోపలికి తోడ్కొని వచ్చిన నిర్వాహకులు ముందుగా ఆయనను 'ఆర్ట్ ఎగ్జిబిషన్' వైపు తీసుకెళ్ళారు.

సెక్యూరిటీ గార్డులు, ప్రెస్ వాళ్ళు, కెమేరాల లెటింగుల మధ్య ఒక్కొక్క అడగూ వేస్తూ ఒక్కొక్క పెయింటింగునూ పరిశీలిస్తున్నారు మినిస్టరు గారు. ఆర్టిస్ట్ తను వేసిన ఆ చిత్రాల వెనుక తన ఉద్దేశ్యాన్ని చెప్ప బోతూ వుంటే మంత్రిగారు వారించారు. ఆయనకన్నీ తెలుసు. తనే కల్పించుకుని ప్రతి చిత్రంలోని మర్మాన్ని విడదీసి తనే ఆర్టిస్టుకి చెప్పడం ప్రారంభించేరు. అభిరామ్ అవాక్కవక తప్పలేదు.



మంత్రిగారిని అమితంగా ఆకర్షించిందొక చిత్రం. శిరోజాలు విరబూసుకుని, వాటితోనే శరీరం కప్పుకున్న ఓ నగ్న సుందరి.

"జుట్టు ఎంత బాగా వేసేవయ్యా?" అన్నారు మినిస్టరుగారు. ఓ క్షణం తర్వాత, "ఆ మెరుపూ, ఆ తళుకూ.." అని ఆగి పోయారు. వారి పొగడ్త జుట్టుకో లేక ఆమె శరీరానికో అర్థం కాలేదు అభిరామ్‌కి. అడిగే సాహసం చెయ్యలేదతడు.

చిత్ర సందర్శనానంతరం సమావేశం ప్రారంభమైంది. వక్తలందరూ తర్వాత మాట్లాడాలని, మంత్రి గారు అర్జంటుగా వేరే పని మీద వెళ్ళవలసి వున్నందున, ముందుగా చిత్రకారునికి సన్మానం చేసి, వారి సందేశం వినిపిస్తారని నిర్వాహకులు ప్రకటన చేశారు.

దుశ్శాలువా, మెమెంటోలతో ఆర్టిస్టుకి సన్మానం జరిగింది. మంత్రి గారు తమ స్పందనని తెలియజేస్తారని ప్రక టించారు. సూది పడితే వినబడేటట్టుంది సభ.

"స్నేహితులారా ఈనాడు చానా సుదినం. ఎందుకో మీ అందరికీ తెలుసు. ఈ రోజు ఈ పెయింటిస్టు వేసిన బొమ్మల్ని చూస్తావుంటే..." సభ్యులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. 'పెయింటిస్టు' పదం గతంలో వారెన్నడూ విన్నట్టులేదు.

"...చూస్తావుంటే, వార్నీ నేను కూడా ఇంత గొప్పోణ్ణి కాలేకపోయేనే అన్న బాధ కలుగుతాంది. చిన్నప్పుడు నేనోపాలి బొమ్మ లేస్తావుంటే మా మేస్టుగారు..." అంటూ మినిస్టరు గారు తన బాల్యం జాడీ మూత తీశారు. అరగంట సేపు సభ ఆ పరిమళాన్ని భరించింది. వారు మాట్లాడుతూ వుంటే, వారి ప్రతి వాక్యం చివరా చప్పట్లు కొట్టేరు సుశిక్షితులైన కొంత మంది. ఒక దశలో అది అతి అయినట్టనిపించి, నిర్వాహకులు చిరాకు ప్రదర్శించబోయారు గానీ, వాళ్ళు మినిస్టరు గారి కార్లోంచి దిగినవాళ్ళని తేలడం వల్ల కిమ్మిన్నాస్తిగా ఉండిపోక తప్పలేదు.

"మన కాడ ఎంతో మంది గొప్ప పెయింటిస్టులు న్నారు. ఆళ్ళ పేర్లన్నీ చెప్పాలంటే ఇప్పుడు టైం చాలదు. అంచేత, ఒక్క ముక్కలో చెప్పాలంటే, మనోడు ఆళ్ళలో ఏ ఒక్కడికీ తీసిపోడని మనవి చేస్త న్నాను. అసలు మనోడికి ఈ అవార్డు కాదు, సెంట్రల్ నించి ఇప్పించాల. సెంట్రల్ నించి అవార్డు అంటే అదిట్టా మాటల్తో అయ్యేది కాదు. దానికెంతో చెయ్యాల. మనోడి కోసం అది నేను సాయంగా చేస్తా నని సవినయంగా మనవి చేసుకుంటున్నాను." సభ అంతా చప్పట్లతో మారుమోగిపోయింది. "అబ్బాయి, నువ్వో పాలి మా పియ్యేని కలిసి నీసర్టిఫి కెట్లు గట్రా చూపించు. ఇకపోతే, ఈ విద్యె అందరికీ అబ్బేది కాదు. నేనూ ఏస్తా బొమ్మలు. ఆటి ఇలువ నాకు తెల్సు.." అంటూ చిత్రకళతో తనకు గల అనుబంధాన్ని సవిస్తరంగా ఆవిష్కరిస్తూ సభని మరో యుగం పాటు పరీక్షించారు.

వారి ప్రసంగం అంతా అయ్యేక, సభ్యుల ఆనందోత్సాహాల మధ్య, చిత్రకారుడి సలహా మేరకు వారు మెచ్చుకున్న 'శిరోజ సుందరి' పెయింటింగ్‌నే వారికి జ్ఞాపికగా బహూకరించారు నిర్వాహకులు. మంత్రి గారు ఆనంద పరవశులయ్యారు.

***

మర్నాడు ఆదివారం. సెలవు రోజున అతి ముఖ్యులకైతే తప్ప మంత్రి గారు ఎవరికీ ఎపాయింటు మెంట్సు ఇవ్వరు. అంచేత తీరిగ్గా పది గంటలకు నిద్ర లేచారు. అప్పటికే పి. ఎ. రెడీగా ఉన్నాడు వార్తా పత్రికలు ముందు పెట్టి.

***

ముందు రోజు సన్మాన సభలో మంత్రిగారి ఫోటో, సమాచారం ప్రచురించిన పత్రికల్ని చూపించాడు. పి. ఎ. అన్నీ చదివి, ఆవులిస్తూ, ఆ పక్కనే సభ వారిచ్చిన గిఫ్ట్ ప్యాకెట్ పడివుంటే, దాన్ని విప్పి చూశారు మంత్రిగారు. 'శిరోజ సుందరి' నవ్వుతూ పలకరించిందాయన్ని. "అదుగో, అట్టా ఎదురుగా అలమారా మీద కనిపించేలా పెట్టవయ్యా దీన్ని" అన్నారు. పి. ఎ. ఆ విధంగా పెట్టేక, దాని వంక చాలా సేపు చూస్తూ వుండిపోయారు మినిస్టరు గారు.

"ఎన్నాళ్ళమట్టో చెబ్దామనుకుంటున్నానయ్యా. ఈ హాల్లో అందరికీ కనిపించేలా అదుగో అక్కడ గాంధీ గారి బొమ్మొకటి ఏయిస్తే ఎట్టావుంటది? పక్కనే నెహ్రూ కూడా నవ్వుతా ఉన్నట్టుంటాదే అదీ అదేయిస్తే ఎట్టావుంటది చెప్పు?"

"వండ్రఫుల్ సార్. తప్పకుండా వేయిద్దాం"

"సరే, నేను స్నానం చేసొస్తాను గానీ, సాయంత్రం పోగ్రాము సంగజ్జూడు" అని లోపలి కెళ్ళారు మినిస్టరు గారు.

పి. ఎ. తన రూమ్‌లోకి దూరి, కంప్యూటరు ఓపెన్ చేసి, పేక ముక్కలాట ఆడుకోవడం ప్రారంభించేడు.

"ఇదిగో నిన్న ఆ పెయింటిస్టున్నాడు చూడు, ఆయన్నోపాలి ఎంటనే రమ్మని ఫోన్చెయ్" అంటూ మంత్రిగారు మళ్ళీ బయటి కొచ్చి చెప్పేసి వెళ్ళిపోయారు.

అయిదు నిమిషాల్లో ఆర్టిస్టు అభిరామ్ ఫోను నెంబరు కనుక్కుని ఫోను చేశాడు పి. ఎ. అరగంట తిరక్కుండా ఆటోలో పరుగెట్టుకొచ్చాడు అభిరామ్. నేషనల్ అవార్డు కోసం మినిస్టరు గారు ఇంత త్వరగా స్పందించడం తన అదృష్టమని అతడు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బై, తన వద్ద నున్న సర్టిఫికెట్సు, సన్మానాల ఫోటోలు ఫైలులో పెట్టుకుని వచ్చాడు.

వాటిని అన్నింటినీ పి. ఎ. ముందు పెడితే, అతడు పని వత్తిడితో సతమత మవుతున్న వాడిలా అసహనంగా మొహం పెట్టి, "ఇవన్నీ తర్వాత చూస్తాను, ముందు ఇలా రండి" అంటూ అతడిని హాల్లోకి తీసుకెళ్ళాడు.

"ఇదిగో ఇక్కడ సెంటర్లో అందరికీ కనిపించేలా గాంధీ, నెహ్రూ కలిసున్న ఆయిల్ పెయింట్ వెయ్యాలి. ఆషామాషీగా వేస్తే కాదు. మినిస్టరు గారికి కూడా పెయింటింగ్‌లో చాలా నాలెడ్జి ఉంది. వెయ్యగలరా?"

"వేస్తానండి" అన్నాడు అభిరామ్.

"సరే రండి" అంటూ పి.ఎ. అభిరామ్‌ని తన ఆఫీస్ రూమ్‌లోకి తీసుకెళ్ళాడు. "ఎంతవుతుందో ఎస్టిమేట్ చెప్పండి" అన్నాడు ఏవో కాగితాలు అటూ ఇటూ తిప్పుతూ.

"చూసుకు చెప్పాలండి" అన్నాడు ఆర్టిస్టు.

"సుమారుగా చెప్పండి ఫరవాలేదు. జాగా వెడల్పు అటూ ఇటూగా ఆరడుగుల దాకా ఉంటుంది. దానికి ప్రపోర్షనేట్‌గా హైట్. అవును కదా?"

పెద్ద పని, పైగా చాలా శ్రమ పడాలి. ఎక్కువే చెప్పాల నుంది గాని ఏమనుకుంటారో నని భయపడి "ఫ్రేం ఖర్చు కాకుండా, పదివేల వరకూ అవుతుందండి. మీకు తెలియందేం కాదండి, పెయింట్సు, కేన్వాసుల రేట్లు బాగా పెరిగిపోయాయండి" అన్నాడు తడబడుతూ, తన రేటును సమర్థించుకుంటున్నట్లు.

పి.ఎ ఓ నిమిషం పాటు ఏం మాట్లాడలేదు. అత్యాశగా తను ఎక్కువ చెప్పడం వల్ల - వచ్చిన అవకాశం కాస్తా జారిపోతోందేమో, తప్పు చేశానేమో అని అభిరామ్ లోపల్లోపలే నాలిక్కరుచుకుంటూ ఉండగా అన్నాడు పి. ఎ. "ఓ.కే. ఓ పని చెయ్యండి. మినిస్టరు గారు ఎంతవుతుంది అని అడిగితే యాభైవేలు అవుతుందని చెప్పండి. నేను వీల్లేదని చెప్పి, నలభై వేలకు ఖాయం చేస్తాను. అందులో ఇరవై నా కివ్వండి. మీకు ఇరవై అంటే మీరు చెప్పిన దానికి రెట్టింపు ఇప్పిస్తున్నాను తెలుసా? రేపు నేషనల్ అవార్డుకీ వాటికీ కూడా నేనే ట్రై చెయ్యాలి మీ కోసం. ఏవంటారు, ఒకేనా?"

అభిరామ్ అయోమయంగా తలాడించేడు. అతడికి ఆనందం, ఆశ్చర్యం, భయం అన్నీ ఏక కాలమందు సంప్రాప్తించాయి.

"ఈ విషయం మీకూ నాకూ తప్పితే మరొకరికి తెలియకూడదు. సరేనా?" అంటూ హెచ్చరించి, "మీరు వెళ్ళి అలా హాల్లో కూర్చోండి. మినిస్టరు గారొస్తారు" అన్నాడు పి. ఎ. అతడు వెళ్ళగానే, అప్పటి వరకూ తిప్పిన కాగితాల్ని పక్కన పడేసి, మళ్ళీ కంప్యూటర్‌లో పేకముక్కల్ని కదపడం ప్రారంభించేడు.



"నువ్వు పై కొస్తావయ్యా పెయింటిస్టూ. నీ చేతిలో మంచి ఆర్టుంది. ఆ అమ్మాయి జుట్టు ఎంత బాగా ఏసేవయ్యా, ప్రతి ఎంటికా యిడియిడిగా మెరుస్తా కనపడతాంది"

కాసేపటికి మంత్రి గారు బయటకు వచ్చి, "అరే, నువ్వొచ్చావా? చెప్పడేంటయ్యా?" అంటూ పి.ఎ. మీద చిరాకుపడి, "దా లోపలికి" అంటూ అభిరామ్‌ని లోపలికి తీసుకెళ్ళారు.

"నువ్వు పై కొస్తావయ్యా పెయింటిస్టూ. నీ చేతిలో మంచి ఆర్టుంది. ఆ అమ్మాయి జుట్టు ఎంత బాగా ఏసేవయ్యా, ప్రతి ఎంటికా యిడియిడిగా మెరుస్తా కనపడతాంది" అంటూ ఇంటి వెనక వసారాలోకి తీసుకెళ్ళి తను కుర్చీలో కూర్చుని, అభిరామ్‌కి స్టూల్ చూపించారు మంత్రిగారు. తటపటాయిస్తూనే కూర్చున్నాడు అభిరామ్.

"నీ సెంట్రల్ అవార్డుకి తప్పకుండా ట్రై చేద్దాం గాని, ఇప్పుడు నాకో హెల్ప్ చేసి పెట్టాల" అన్నారు మినిస్టరుగారు. అభిరామ్ గుండె దడదడ కొట్టుకుంది. ఆయనకి తను చెయ్యగలిగిన హెల్ప్ ఏం ఉంటుంది? గాంధీ గారి బొమ్మ ఊరికే వెయ్యమంటారేమో జాతీయ అవార్డు ఇప్పిస్తున్నపుడు ఆ మాత్రం తను చెయ్యలేడా?

"అలాగే సార్ చెప్పండి" అన్నాడు అభిరామ్.

మినిస్టరు గారు వెంటనే తన కుర్చీ పక్కనే ఉన్న పెట్టె తెరిచి అందులోంచి ఒక నల్లని బ్రష్షూ, చిన్న గిన్నె, ఒక పౌడర్ పేకట్టూ తీశారు.

"నేనూ కలుపుతా గానీ, నువ్వు మంచిగా వొంటి మీద పడకుండా నా జుట్టుకి పెయింటింగ్ ఎయ్యాల. ఆ అమ్మాయి జుట్టుకేశావు చూడు, ఎంటికెంటికా ఇడి ఇడిగా మెరిసిపోయేట్టు. అట్టాగన్నమాట. నీ చేతిలో ఆర్టుందయ్యా, అందరికీ వస్తదా చెప్పు. దేవుడిచ్చిన వొరం. ప్రతిసారీ మా పి.ఎ. ఏస్తున్నాడు గానీ, వొంటి మీదకి పాకిపోయేలా చెండాలం చేస్తున్నాడు. ఆడు నీయంత పెయింటిస్టు కాడు కదా!" అంటూ మంత్రి గారు పకపకా నవ్వుతూ, నల్లటి పొడరులో నీళ్ళు కలిపి, ఆ గిన్నెనీ, బ్రష్షునీ అతడికి అందించి, తల ముందుకి వంచేరు.

"జుట్టుకి రంగు వేసేవాడు ఆర్టిస్టూ కాడు, పెయింటరూ కాడు, ఏమవుతాడు మరి? మినిస్టరు గారన్నట్టు పెయింటిస్టేనేమో! అవును 'పెయింటిస్టే' అనుకున్నాడు అభిరామ్.

★